# 'మాంబళం' —కొల్లూరి మధుశ్రీ

మద్రాసు సెంట్రల్‌లో రెండవ ప్లాట్‌ఫాంపై ట్రెయిన్ ఆగింది. ఆ ట్రెయిన్‌లో చాలా మంది వున్నారు. వారిలో ప్రకాశం ఒకడు. ప్రకాశం పూర్తి పేరు వెంకట సూర్యప్రకాశరావు తెలుగు బి.ఎ. అంటే తెలుగు మీడియం అన్నమాట. ఇక్కడ తెలుగు మీడియం అని ఎందుకు చెప్పవలసి వచ్చిందో కథ చదివితే మీకే తెలుస్తుంది.

ప్రకాష్ లగేజీతో దిగేసరికి ఎదురుగా ప్రత్యక్షం అయ్యారు అతని బాబాయ్ పరమేశన్-ఆయన కొడుకు సుందరన్. ప్రకాష్ బాబాయ్ అసలు పేరు పరమేశం. అయితే మద్రాసులో సెటిల్ అయ్యాక ఆయన పేరు పరమేశన్‌గాను...ఆయన కొడుకు సుందర్ శాస్త్రి... సుందరన్‌గానూ వాడుకలోకి వచ్చేశారు.

పెద్ద లగేజీ ఏదీ లేకపోవడంతో పోర్టర్ అవసరం లేకుండానే ముగ్గురూ సెంట్రల్ బయటికి వచ్చిపడ్డారు.

విజయవాడ స్టేషన్‌లా దారులు తెలియక పడే ఖంగారు...అవస్థ లేకుండానే బయటికి వచ్చేయడంతో కాస్తంత రిలీఫ్ ఫీలయ్యాడు ప్రకాష్.

ముగ్గురూ ఆటోలో బయలుదేరారు...

ప్రకాష్ మద్రాసు సిటీ చూడ్డానికి రాలేదు. అతని వూరు రావడానికి ఒక విశేషం వుంది. అతని బాబాయ్ పరమేశన్‌తోపాటు అతని దూరపు బంధువు కూడా ఇక్కడ సెటిల్ అయ్యాడు. ఆయన పేరు కృష్ణస్వామి. మద్రాసుకి రాని క్రితం ఆయన పేరు రాధాకృష్ణ స్వామి. ఆయనకు ఇద్దరు అబ్బాయిలు-ఒక అమ్మాయి. అమ్మాయి చక్కని చుక్క. సాధారణంగా పంజాబీ డ్రస్సులు వేస్తుంటుంది. తెలుగు మాట్లాడుతుంది. ఇంగ్లీషూ తమిళం బాగా వచ్చును. చదువు బియస్సీ. పేరు శార్వాణి. ఆమెకూ దగ్గర బంధుత్వాలేమీ లేవు. అలాగే ప్రకాష్‌కీ దగ్గర సంబంధాలేమీలేవు. పరమేశన్‌కీ-కృష్ణ స్వామికీ పరిచయం వుండడంతో... ఈ పెళ్ళి వ్యవహారానికి లింక్ పడింది.

-ఆటో పరమేశన్ ఇంటి ముందు ఆగింది. ముగ్గురూ దిగి లోపలకు నడిచారు. ప్రకాష్ పిన్ని అతడిని చూసి చాలా ఆనందపడింది. భోజనాలనంతరం పిచ్చాపాటి మాట్లాడుకుంటున్న సమయంలో ముందుగా అతని బాబాయ్ పరమేశన్...

"ఏరా! పెళ్ళి చూపులు ఎప్పుడు ఏర్పాటు చేయించ మంటావ్?" అన్నాడు.

"వద్దు బాబాయ్! హఠాత్తుగా వెళ్ళి చూస్తేనే వారి పద్ధతులూ అవీ. అర్థం అవుతాయి. నాకు అడ్రస్ ఇవ్వండి. నేనే వెళతాను. విజయవాడ నుంచి మీ ఇంటికి వచ్చినట్లూ...సరదాగా ఓసారి చూద్దాం అని వెళ్ళి నట్టు గా వెళతాను" అన్నాడతను.

"అయితే ఒక పని చెయ్యి. నువ్వు బస్సులో వెడితే రూటు కనుక్కోవడం కష్టం అవుతుంది. ఆటోలో అంటే...కొత్త వాళ్ళని, తమిళం రాని వాళ్ళనీ వాళ్ళు మోసం చెయ్యవచ్చు. కనుక లోకల్ ట్రైన్‌లో వెళ్ళు. నేను కానీ-సుందర్ కానీ వద్దామంటే వారెవరైనా ఎదురు పడితే ప్లాన్ అంతా ఫెయిల్ అవుతుంది. నీ ఇష్టం. రమ్మంటే వస్తాము."

"ఒద్దు బాబాయ్! నేనే వెళతాను. అడ్రస్ ఇవ్వు" అన్నాడు ధీమాగా.

"అడ్రస్ అవసరం లేదురా అబ్బాయి. చాలా ఈజీ. సుందర్ నిన్ను లోకల్ ట్రెయిన్ ఎక్కిస్తాడు. నువ్వు దిగవలసిన స్టేషన్ 'మాంబళం'. ఖచ్చితంగా నాలుగవ స్టాపులో దిగు. స్టేషన్ బయటికి రాగానే ఎదురుగా రంగనాథం స్ట్రీట్ అని విజయవాడ బీసెంటు రోడ్డు లాంటి రోడ్డు వుంటుంది. ఆ స్ట్రీట్‌లో మొదటి సందులో రెండో ఇల్లు. ఇంటి బయట కృష్ణస్వామి అని నేమ్ ప్లేట్ వుంటుంది" ఇంటి నెంబరు కూడా చెప్పేడు పరమేశన్.

- ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు సుందరన్, ప్రకాష్‌ని లోకల్ ట్రెయిన్ ఎక్కించాడు.

ఎలక్ట్రిక్ ట్రెయిన్ అవడంతో చాలా వేగంగా పోతోంది. సీటులో కూర్చుని కిటికీలోంచి చూస్తున్నాడు ప్రకాష్. ట్రెయిన్ స్టేషన్ - స్టేషన్‌లోనూ ఆగి వెళ్ళటం గమనిస్తూనే వున్నాడు. కానీ ఏదో పరధ్యానం. తాను చూడబోయే అమ్మాయి గురించి ఆలోచిస్తూ...ఊహాల ప్రపంచంలో తేలిపోతూ హఠాత్తుగా ఉలిక్కిపడి చూసాడు. చాలా మంది దిగిపోతున్నారు. ఎక్కడి నుండో జనం మధ్య 'మాంబళం-మాంబళం' అన్న కేక. దాంతో ఒక్క ఉదుటున లేచి చక్ మని ట్రైన్ దిగాడు ప్రకాష్. మరుక్షణం ట్రైన్ కదిలిపోయింది.

అనుకోకుండా స్టేషన్ రావడం...ఎవరో కేక పెట్టడం...అది తన చెవిన పడటం...తాను దిగేయడం అన్నీ ఫాస్ట్‌గా జరిగిపోయాయి. ట్రైన్ వెళ్ళిపోయింది. ఇక్కడ దిగి వుండకపోతే చాలా ఇబ్బంది పడివుండేవాడి నని అనుకున్నాడు ప్రకాష్. తనని తాను అభినందించు కుంటూ...

స్టేషన్ బయటికి వచ్చాడు ప్రకాష్. అతనికి బయట మెయిన్ రోడ్, ఆ రోడ్డుకి పైన రోడ్‌ని క్రాస్ చేసే వంతెన కనిపించాయి. అతనికి తన బాబాయి చెప్పిన రోడ్డు కనిపించలేదు. ఎలా కనిపిస్తుంది? అతడు దిగింది 'మాంబళం' స్టేషన్ కాదు. అది ఎగ్మోర్. తెలుగు మీడియంలో చదువుకున్న ఆంధ్రా హీరోకి ఇంగ్లీషు జీరో. అని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. తమిళ్ అసలు రాదు. అడ్రస్ లేదు. అప్పుడైనా అతడు వెనక్కి తిరిగి చూసుకుంటే...స్టేషన్ బిల్డింగ్ పైన గుమ్మడి కాయంత అక్షరాలు కనిపించేవి ఎగ్మోర్ అని. అప్పటి కైనా వచ్చీరాని ఇంగ్లీషులో ఎవరినైనా అడిగినా సరి పోయేది. అయితే అతడికి సరిగా ఆ వీధి పేరు గుర్తులేదాయె. దాంతో ఎవరినో రామానుజన్ స్ట్రీట్ అని అడిగాడు. "స్ట్రెయిటూ పోయి లెఫ్ట్‌లో కట్ పండు" అని ఆ వ్యక్తి అనడంతో మనవాడు ఏ పండో అర్థం కాక ఎగ్మోర్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణాలు చేయక తప్ప లేదు.

హాయిగా వెళ్ళి పెళ్ళి చూపులు చూసుకోక ఎందుకీ థ్రిల్ కోసం పాట్లు... తనను తాను ఎంతగానో తిట్టు కున్నాడు ప్రకాష్.

ప్రకాష్‌కి-శార్వాణికి పెళ్ళయిన కొత్త రోజుల్లో ఓ రాత్రి సరదాగా "నేను నీ కోసం...అదే నిన్ను చూడటం కోసం ఎన్ని తిప్పలు పడ్డానో తెలుసా?" అంటూ ఈ విషయం చెప్పి "ఆ తర్వాత తెలిసింది నాకు-తమిళంలో మామిడి పండుని 'మాంబళం' అంటారనీ...ఎగ్మోర్ స్టేషన్‌లో "మాంబళం-మాంబళం" అని అరిచింది, మామిడి పళ్ళు అమ్ముకునే వాడనీ" చెప్పేడు ప్రకాష్. అతని మాటలకు పడీ పడీ నవ్వింది శార్వాణి. నవ్వుతున్న ఆమె ముఖం పచ్చని మామిడిపండులా కనిపించింది ప్రకాష్‌కి.



Mudra:B:CC:627:102 TL